RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 217 పేజీలు - 08 శుక్రవారం 03 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....


- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

### ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే

# ఉమ్మడి లక్ష్యం

**- భారత్, జపాన్ బంధం మరింత బలోపేతం**

● జపాన్ ప్రధాని సనాయె తకాయిచి ● ఢిల్లీలో మోడీతో ద్వైపాక్షిక సమావేశం ● ఇరుదేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ ,జూలై 02:** భారత్, జపాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడ్డాయి. భారత ప్రధాని మోడీ ఆహ్వానం మేరకు మూడు రోజుల అధికారిక పర్యటన కోసం భారత్‌కు వచ్చిన జపాన్ ప్రధాని సనాయె తకాయిచి గురువారం ఢిల్లీలో ప్రధాని మోడీతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించారు. అనంతరం ఇరు దేశాల మధ్య పలు కీలక అవగాహనా ఒప్పందాలు జరిగాయి. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని సనాయె తకాయిచి మాట్లాడుతూ స్వేచ్ఛా యుత, సుసంపన్నమైన,

మిగతా2లో...

### మూసీ సుందరీకరణ ప్రాజెక్టు

# మొదటి దశకు ఆమోదం

**- రూ.7,345కోట్లతో మొదటి దశ పనులకు గ్రీన్ సిగ్నల్**

● వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేస్తూనే కోర్టులో సవాల్ ● ఇక స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లకు కూడా మధ్యాహ్న భోజనం ● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో మొత్తం 6,278 పోస్టుల మంజూరు ● గిడ్డంగులు, నవోదయ విద్యాలయాలకు పలుచోట్ల భూ కేటాయింపులు ● తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రూ.7,345కోట్లతో మొదటి దశ పనులు చేపట్టనున్నారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 6,278 పోస్టుల మంజూరుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్రంలో వీబీ జీరామ్‌జీ పథకాన్ని అమలు చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. దీనికి సంబంధించిన అభ్యంతరాలపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని నిర్ణయం తీసుకుంది.కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి , సీతక్కలు వివరించారు. ఉపాధి హామీ మిగతా2లో...



## భట్టితో సిఎస్ మర్యాదపూర్వక భేటీ

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:**
రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం మధ్యాహ్నం తెలంగాణ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారు. సీఎస్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం డిప్యూటీ సీఎంను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇరువురు క్షేమ సమాచారాలు చర్చించారు. సిఎస్‌గా నియమితులయినందుకు జాజును భట్టి అభినందించారు.

### క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు

# త్వరలో టెండర్లు

● తుది దశలో స్థలాల సేకరణ ● దశలవారీగా ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ● 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా వెయ్యి ఇళ్ల నిర్మాణం ● మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** క్యూర్ పరిధిలోని ఇన్నర్ రింగ్ రోడ్ ప్రాంతంలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మూడు కార్పొరేషన్ల పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరో రెండు నుంచి మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. గోషామహల్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన పట్టాలను గురువారం నాడు మంత్రి సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, స్థానికఎమ్మెల్యే రాజాసింగ్ తదితరులతో కలిసి లబ్దిదారులకు మిగతా2లో...



## సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

**- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కెటిఆర్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** అసత్యాలతో ప్రజలను మబ్బే పెట్టే కార్యక్రమం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు విమర్శించారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలకు సమాధానం ఇచ్చే తెగువ కాంగ్రెస్ సర్కార్‌కి లేదని ఎద్దేవా చేశారు. గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా సవాల్ చేశారని..

మిగతా2లో...

### గురుకులాల టెండర్ల అవినీతిపై

# చర్చకు సిద్ధం

● ఎన్నికైన ప్రజాప్రతినిధులతోనే చర్చిస్తాం

● కెసిఆర్ లాగా కడప కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వలేదు

● బిఆర్ఎస్ విమర్శలపై మంత్రి పొన్నం విమర్శలు



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** గురుకులాల టెండర్లలో అవినీతిపై చర్చించేందుకు తాము సిద్ధమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బిఆర్ఎస్ సవాల్‌తో మంత్రులు గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. పొన్నం మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో దేవాల యం లాంటి అసెంబ్లీలో హరీశ్‌రావు చర్చకు రావాలని సవాల్ చేశారు. తాము ప్రెస్‌క్లబ్‌కు కూడా వస్తామని.. కానీ రాజ్యాంగంలో ఎన్నికైన వ్యక్తులు చర్చకు రావాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈరోజు 12 గంటల్లోగా గన్‌పార్క్ దగ్గరకు రావాలని అన్నారు. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు వస్తే తాము ఎక్కడైనా చర్చకు వస్తామని స్పష్టం చేశారు. కేసీఆర్ హయాంలో లాగా కడప కాంట్రాక్టర్లకు తమ ప్రభుత్వం టెండర్లు ఇవ్వలేదని తేల్చిచెప్పారు. మిగతా2లో...

### కాంగ్రెస్ వర్సెస్

# బీఆర్ఎస్

● అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు
● మాటల : గన్‌పార్క్ వద్దకు వచ్చిన మంత్రులు జూపల్లి,
యుద్ధంతో : పొన్నం, అడ్లూరి, అజహరుద్దీన్ ● వేడెక్కిన తెలంగాణ భవన్ వద్ద తీవ్ర ఉద్రిక్తత గన్‌పార్క్‌కు వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతల యత్నం ● రాజకీయం : హరీశ్‌రావు సహా పలువురి నాయకుల అరెస్టు


2లో

## కవిత ఉప్పల్ భూపోరాటానికి పిలుపు

**- ఎక్కడిక్కడే టిఆర్ఎస్ కార్యకర్తల అరెస్ట్**


2లో

## సిఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

● సీతక్క నాయకత్వంలో పలు అంశాలపై చర్చ

● ఏజెన్సీలో అదనగంగా 2వేల ఇందిరమ్మ ఇళ్లకు వినతి


2లో

# మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొదటి దశకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా తొలగించారని మండిపడ్డారు. దీని స్థానంలో విబిజిరామ్ పథకం తేవడం దుర్మార్గమని అన్నారు. విధిలేని పరిస్థితిలో దీనిని ఆమోదిస్తూనే, దీనిపై న్యాయపోరాటం చేయాలని కేబినెట్ నిర్ణయించిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను సంప్రదించకుండా ఏకపక్షంగా అమల్లోకి తెచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టంపై రాష్ట్ర మంత్రివర్గం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ కొత్త చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని, ఇది ఫెడరల్ , రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ సబ్ కమిటీ చేసిన సిఫారసులపై చర్చించారు. ఉపాధి హామీ పథకంలో ఎలాంటి మార్పులు చేయవద్దని గత జనవరిలోనే అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, మరోసారి కేంద్రానికి నిరసన తెలపాలని నిర్ణయించారు. అయితే, ఇతర రాష్ట్రాలన్నీ దీనికి ఆమోదం తెలపడం, ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశంతో గత్యంతరం లేని పరిస్థితిలో ఈ చట్టాన్ని జులై 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు నోటిఫికేషన్ జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. కానీ, ఈ నిబంధనలపై సుప్రంకోర్టులో న్యాయపోరాటం చేయాలని, పార్లమెంట్‌లోనూ కేంద్రాన్ని నిలదీయాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అందించే అల్పాహారం, పాలు , మధ్యాహ్న భోజనాన్ని ఇకపై వారితో పాటు ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఇతర సిబ్బందికి కూడా అందించాలని కేబినెట్ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. పిల్లలకు నాణ్యమైన పోషకాహారం అందించే సంకల్పంతో పాటు, భోజన వితరణలో జవాబు దారీతనం పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల రాష్ట్రంలో దాదాపు లక్షన్నర మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, పాఠశాల సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.కొత్తగా అందుబాటులోకి వస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో భారీ ఎత్తున నియామకాలు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సనత్ నగర్, ఎల్.బి.నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా మొత్తం 6,278 డాక్టర్లు, వైద్య సిబ్బంది పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో 1,494 రెగ్యులర్ పోస్టులు, 549 కాంట్రాక్ట్ పోస్టులు, 4,235 ఔట్ సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. ఈ ఆసుపత్రులను నిమ్స్ తరహాలో అభివృద్ధి చేయాలని, ఇక్కడ అందించే వైద్య సేవలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు కూడా ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌లో భాగంగా ఫేజ్-ఎ పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తొలి దశలో హిమాయత్ సాగర్ నుంచి ఈసా, ఉస్మాన్ సాగర్ నుంచి మూసా ప్రవాహాలు ప్రారంభమయ్యే చోటు నుంచి బాపూఘాట్ వరకు 21 కిలోమీటర్ల పొడవునా అభివృద్ధి పనుల కోసం రూ. 7,345.12 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు పనులు , నిర్వహణ కోసం నూతనంగా 147 పోస్టుల సృష్టికి, అలాగే ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని డిప్యూటేషన్‌పై తీసుకునేందుకు అంగీకారం తెలిపారు. నిత్యావసర వస్తువుల గోదాముల నిర్మాణానికి గాను తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు మార్కెట్ రేటు ప్రకారం భూములను కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బొల్లికుంట గ్రామంలో 50 ఎకరాలు, రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం కర్కాలపహాడ్ గ్రామంలో 10 ఎకరాల భూమిని కేటాయించను న్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందు కు కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలకు స్థలాలను కేటాయి స్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు కోసం మహబూబ్‌నగర్ జిల్లా పెద్దాయిపల్లి గ్రామంలో 20.18 ఎకరాలు, సూర్యాపేట జిల్లా కోదాడలో 19.12 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యా ర్థులతో పాటు 1.50 లక్షల మంది ఉపాధ్యాయులు, లెక్చరర్లు, సిబ్బందికి కూడా అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నుంచి, సిబ్బంది నుంచి ప్రభుత్వానికి అందిన విజ్ఞప్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి మరియు మంత్రివర్గం దీనిపై సానుకూలంగా స్పందించింది. ఉపాధ్యాయులు మరియు స్కూల్ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు, ఒత్తిడి లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఈ నిర్ణయం ఎంతో దోహదపడుతుందని క్యాబినెట్ అభిప్రాయ పడింది. తాజాగా జరిగిన రాష్ట్ర మంత్రివర్గంలో ఈ ప్రతిపాదనకు అధికారికంగా ఆమోద ముద్ర వేశారు. విద్యార్థులతో పాటు ఒకే పంక్తిలో ఉపాధ్యాయులు కూడా భోజనం చేయడం వల్ల పాఠశాలల్లో సమానత్వం పెంపొందడమే కాకుండా, భోజనం నాణ్యతను నిరంతరం పర్యవేక్షించడానికి వీలవుతుందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ తీసుకున్న ఈ వినూత్న నిర్ణయంపై ఉపాధ్యాయ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు త్వరలో టెండర్లు

(మొదటి పేజీ తరువాయి)

అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం 'ప్రతి పేద కుటుంబానికి ఇల్లు' అనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలోని 19 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కో చోట కనీసం 500 నుంచి 1000 ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం రెండో, మూడో విడతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ఒక్కో నియోజకవర్గానికి 5500 వరకు ఇళ్లు కేటాయించిన విషయాన్ని గుర్తు చేస్తూ, పట్టణ ప్రాంతాల్లో భూమి విలువ ఎకరాకు రూ.100 నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్నా కూడా ఆ భూముల విలువను పక్కనబెట్టి పేదలకు అదే ప్రాంతంలో ఇళ్లు నిర్మించి వారి పేరిట పట్టాలు ఇస్తామని మంత్రి తెలిపారు. ధూల్‌పేట ప్రాంతంలో గత ప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా నిలిచిపోయిన 125 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి అందిస్తున్నామని, మిగిలిన పేదలకు కూడా ఇళ్లు మంజూరు చేసేలా పరిసర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించేందుకు కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో ఎవరూ నిరాశ చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. పేదలను నగరాల నుంచి 30 కిలోమీటర్ల దూరంలోకి తరలించి ఇళ్లు కట్టే విధానం కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉండదని, వారి జీవనాధారాలకు దగ్గరగా, అదే నియోజకవర్గ పరిధిలోనే ఇళ్లు అందించడం ప్రభుత్వ కట్టుబాటు అని మంత్రి స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మించిన ఇళ్ల కంటే కేవలం రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇళ్లు నిర్మిస్తుందని, అది సాధ్యం కాకపోతే తాను రానున్న ఎన్నికల్లో పోటీ చేయనని విసిరిన సవాల్‌కు ఇప్పటివరకు బీఆర్ఎస్ నేతల నుంచి స్పందన రాలేదని గుర్తుచేశారు. పేదల ఇళ్ల నిర్మాణంలో ప్రయోజనం లేదనే ఆలోచనతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ ప్రాజెక్టుల పేరుతో అవినీతికి పాల్పడిందని ఆరోపిస్తూ, కాంగ్రెస్ మాత్రం అదే నిధులను పేదల గూడు కోసం వినియోగిస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా గుడిసెల్లేని తెలంగాణ లక్ష్యాన్ని సాధిస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** రాష్ట్రంలో రాజకీయం వేడెక్కింది. అధికార, ప్రతిపక్ష నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లతో హైదరాబాద్ నగరం అట్టుడికింది. నాయకుల మధ్య మాటల యుద్ధం నేపథ్యంలో గురువారం హైటెన్షన్ వాతావరణం నెలకొంది. రాష్ట్ర అప్పు, గురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి అంశాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలు తీవ్ర దుమారం రేపాయి. రైతాంగానికి ప్రభుత్వం చేసిన సంక్ష?మంపై చర్చకు సిద్ధమా? అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరిన విషయం తెలిసిందే.ఆ సవాల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వీకరించారు. తాను చర్చకు సిద్ధమనీ, స్థలం, తేదీ చెప్పాలని ప్రతి సవాల్ విసిరారు. రాష్ట్ర అప్పు రూ.3.50 లక్ష?ల కోట్లని ప్రకటించారు. దీనిపై స్పందించిన మంత్రి జూపల్లి కృష్ణారావు రాష్ట్ర అప్పులపై గణాంకాలతో సహా చెప్పేందుకు బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌కు గురువారం ఉదయం 11 గంటలకు వస్తానని అన్నారు. ఇంకోవైపు గురుకుల విద్యాసంస్థల టెండర్లలో రూ.రెండు వేల కోట్ల కుంభకోణం జరిగిందంటూ మాజీమంత్రి హరీశ్‌రావు, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు.దీన్ని సవాల్ చేస్తూ మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అజహరుద్దీన్ గురువారం ఉదయం 10 గంటలకే గన్‌పార్క్ వద్దకు చేరుకున్నారు. ఇదే సమయంలో తెలంగాణ భవన్‌కు కేటీఆర్, హరీశ్‌రావు వచ్చారు. అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. పూర్తి వివరాలతో ఇక్కడికి వచ్చామని చెప్పారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాకుండా మాజీమంత్రి హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు రావాలని సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన హరీశ్‌రావు గన్‌పార్క్ వద్దకు వచ్చేందుకు యత్నించారు. కారులో కూర్చొగానే పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మంత్రులేమో రమ్మంటారు, పోలీసులేమో గన్‌పార్క్ వద్దకు



వెళ్లకుండా అడ్డుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. అదే సమయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్‌లకు ఆయన ఫోన్ చేశారు. వారు లిఫ్ట్ చేయకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కారులో వెళ్లేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పడంతో దిగి నడుకుంటూ వెళ్లేందుకు యత్నించారు.దీంతో పోలీసులు హరీశ్‌రావు, ఇతర నాయకులను అడ్డుకుని అరెస్టు చేశారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హరీశ్‌రావును మాజీమంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పి సబితా ఇంద్రారెడ్డి పరామర్శించారు. ఇంకోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్ వద్ద కేటీఆర్ వేచి చూశారు. అయితే జూపల్లి కృష్ణారావు గన్‌పార్క్ వద్దకు వెళ్లారు. గన్‌పార్క్ వద్దకు రావాలని కేటీఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ అక్కడికి వెళ్లేందుకు యత్నించారు. దీంతో పోలీసులు ఆయన్ను అడ్డుకున్నారు. నా మాటలకు కట్టుబడి ఉన్నా : జూపల్లికేసీఆర్ హయాంలో రాష్ట్ర అప్పులపై తన మాటలకు కట్టుబడి ఉన్నానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పు రూ.7.30 లక్ష?ల కోట్లని వివరించారు. ఈ అప్పునకు సంబంధించిన గణాంకాలు తప్పని నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని ప్రకటించారు. గురుకుల టెండర్లలో అవినీతి జరగలేదు : అడ్లూరి, పొన్నంగురుకుల విద్యాసంస్థల టెండర్లలో అవినీతి జరగలేదని మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్ అన్నారు.అవినీతి జరిగినట్టు నిరూపిస్తే దేనికైనా రెడీ, అవసరమైతే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారమే టెండర్ల ప్రక్రియను అధికారులు నిర్వహించారని వివరించారు. దీన్ని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ఉండగా ఫోన్ కాల్‌కు స్పందించలేదనీ, పిరికివాళ్లమని అనడం హాస్యాస్పదమని చెప్పారు. సీఎంకు దమ్ముంటే అసెంబ్లీ సమావేశాలు పెట్టాలి : కేటీఆర్ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు తొడగొట్టి తోకముడిచారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు కోసం తెలంగాణ భవన్‌లో కుర్చీ వేసి మూడు గంటలు వేచి చూసినా రాకుండా పారిపోయారని విమర్శించారు. తాము గన్‌పార్క్ వెళ్లకుండా పోలీసులతో అడ్డుకుని డ్రామాలు ఆడారని అన్నారు. తమతో చర్చించే దమ్ము వారికి లేదన్నారు. హరీశ్‌రావు, ఇతర నేతల్ని అక్రమంగా అరెస్టు చేయడం సిగ్గుచేటని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సమస్యలపై చర్చించే దమ్ముంటే వెంటనే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలను పెట్టాలని డిమాండ్ చేశారు. డైవర్షన్ పాలిటిక్స్‌ను ప్రజలు సహించబోరని అన్నారు.జూపల్లి రాజీనామా చేయాలి : హరీశ్‌రావుఈ ప్రభుత్వం సవాళ్లు చేసి చివరకు తోకముడిచిందని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు.మంత్రులు గోల్ కొడతామనుకుని సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.ఎనిమిది లక్షల కోట్ల అప్పు అయ్యిందని ఆరోపిస్తూ తెలంగాణ భవన్‌కు వస్తానని సవాల్ విసిరారని అన్నారు. కేటీఆర్, తాను తెలంగాణ భవన్‌లో ఉంటే చర్చకు రాలేదన్నారు. పాలమూరు పౌరుషం ఉంటే జూపల్లి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిన్న రూ.ఎనిమిది లక్షల కోట్లనీ, ఇప్పుడు రూ.ఏడు లక్షల కోట్ల అప్పు అంటున్నారని విమర్శించారు. గురుకుల టెండర్లలో అవకతవకలు జరిగాయన్నారు. అవినీతి చేసినందుకే పోలీసులను అడ్డుపెట్టుకుని మంత్రులు తప్పించుకున్నారని అన్నారు. కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సర్కారు నడవడం లేదనీ, సర్కర్ నడుపుతున్నారని విమర్శించారు.

# సమాధానం చెప్పలేనప్పుడు సవాళ్లు ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రెస్‌క్లబ్‌కి వెళ్తే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుల విషయంలో దమ్ముంటే రావాలని సీఎం సవాల్ చేశారని తెలిపారు. పలు విషయాలపై చర్చించడానికి తాము సిద్ధమని రేవంత్‌రెడ్డికి చెప్పామని.. ఎక్కడైనా చర్చకు సిద్ధమేనని కేటీఆర్ స్పష్టం చేశారు. సవాల్ విసిరిన ముఖ్యమంత్రి పారిపోయారని సెటైర్లు గుప్పించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యలో సవాల్ విసిరారని.. సీఎం పంపితే జూపల్లి వస్తున్నారని తాము అనుకున్నామని.. కానీ పనికి మాలిన డైలాగ్‌లను జూపల్లి కొడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. సవాల్ విసిరి మంత్రులు పారిపోతున్నారంటేనే.. ఈ ప్రభుత్వ అసమర్థత ఏంటో తెలిసిందని ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చర్చకు బయల్దేరగానే ఈ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయించిందని ప్రశ్నించారు. గన్‌పార్కు రమ్మన్నారని.. వెళ్తుంటే అరెస్ట్ చేశారని మండిపడ్డారు. చేతకాని వాళ్లు ఎందుకు సవాల్ విసరాలని నిలదీశారు. అసెంబ్లీలో తనకు గంట సమయం ఇవ్వాలని మాజీ మంత్రి కేటీఆర్ కోరారు.

# గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

తాము పారదర్శకంగా గురుకులాల టెండర్లు జరగాలని చూశామని పేర్కొన్నారు. 'గురుకులాల టెండర్ కోసం ముందుకు వచ్చిన కాంట్రాక్టర్ మాకేమైనా చుట్టమా?. టెండర్లలో అసలు అవినీతి జరిగింది రూ.2 వేల కోట్లా..? రూ.5వేల కోట్లా..?. బీఆర్ఎస్ నేతలు ఏది పడితే అది మాట్లాడుతున్నారు. ఆధారాలతో రండి మేము చర్చకు సిద్ధం. మేము అవినీతి చేసినట్లు నిరూపిస్తే.. ముగ్గురు మంత్రులం గన్‌పార్క్ దగ్గర ముక్కు నేలకు రాసి రాజీనామా చేస్తాం.

మేము పిరికివాళ్లం కాదు. ఎవరితో పడితే వారితో చర్చకు రాము. మాజీ సీఎం కేసీఆర్ గులాబీ పార్టీ నేతలను అదుపులో పెట్టుకోవాలి. లేదంటే కేసీఆర్‌కు చెడ్డపేరు వస్తుంది. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఏ విషయమైనా మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలి. ఆయన అవినీతి చేసి ఉండొచ్చు.. ఆర్ఎస్పీకి మేం సమాధానం చెప్పం. తమ జోలికి వచ్చి ప్రవీణ్ ఇబ్బంది పడొద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు.

# కవిత ఉప్పల్ భూపోరాటానికి పిలుపు

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రక్షణ సేన పార్టీ నాయకులను, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ఎక్కడిక్కడే అరెస్టు చేసారు. టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గురువారం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో భూపోరాటానికి పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారులతో కలిసి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పోరాటం కొనసాగనుంది. ఈ మేరకు ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గానికి తెలంగాణ వ్యాప్తంగా ఉన్న టీఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చేందుకు సిద్ధమయ్యారు.

అయితే, భూపోరాటానికి వెళ్తారనే సమాచారంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేస్తున్నారు. దీంతో ముందస్తు అరెస్టులను ఆ పార్టీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. మరోవైపు, ఈరోజు ఉదయం ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో భూపోరాటం జరిగే ప్రాంతానికి కల్వకుంట్ల కవిత చేరుకోనున్నారు. దీంతో ఆ ప్రాంతంలో మొత్తం ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# సిఎంతో గిరిజన ఎమ్మెల్యేల భేటీ

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** సచివాలయం లో మంత్రి సీతక్క నేతృత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆదివాసి ,గిరిజన శాసన సభ్యులు కలిశారున. పలు అంశాలపైన సీఎం కి వినతి పత్రాలు అందించారు. ఏజెన్సీ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో అదనం గా 2 వేల ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని కోరారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో పాటు ఇందిర గిరి జల వికాసం పథకం అమలు చేయాలని అన్నారు.గిరిజన ఆశ్రమ పాఠశాలలను ఇంటర్ వరకు అప్గ్రేడ్ చేయాలన్నారు. అలాగే ఐటీడీఏ లను మరింత బలోపేతం చేయాలన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అశ్వరావుపేట ఎంఎల్ ఏ జారే ఆదినారాయణ,పినపాక ఎంఎల్ ఏ పాయం వెంకటేశ్వర్లు,ఇల్లందు ఎంఎల్ ఏ కోరం కనకయ్య,భద్రాచలం ఎంఎల్ ఏ తెల్లం వెంకట్ రావు,ఖానాపూర్ ఎంఎల్ ఏ వెడ్మ బొజ్జు ఉన్నారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,అడ్లూరి లక్ష్మణ్,అజారుద్దీన్ కూడా ఉన్నారు.

# గంజాయి స్మగ్లర్ల కొత్త ఎత్తులు

**● స్పీడ్ పోస్ట్ ద్వారా పార్సిళ్లలో గంజాయి ● హైదరాబాద్ పోలీసుల ఆపరేషన్‌లో గుర్తింపు ● వివరాలు వెల్లడించిన నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 02:** దేశవ్యాప్తంగా స్పీడ్ పోస్ట్ ద్వారా గంజాయి సరఫరా చేస్తున్న ముఠాను అరెస్ట్ చేశామని హైదరాబాద్ సీపీ సజ్జనార్ తెలిపారు. రైళ్లు, విమానాల ద్వారా వచ్చిన స్పీడ్ పోస్ట్ పార్సిళ్లకు స్కానింగ్ లేకపోవడంతో సరఫరా సులభమైందన్నారు. దీంతో ఇక పోస్టల్ పార్సిళ్లకు తప్పనిసరి స్కానింగ్ అమలు చేయాలని కేంద్ర శాఖలకు లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఎస్ఆర్ నగర్, గుడిమల్కపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పార్సిల్‌పై అనుమానం కలిగి దర్యాప్తు చేశామని.. హైదరాబాద్‌కు వచ్చిన 2 పార్సిల్స్ ఫ్లైట్‌లోనే వచ్చాయన్నారు. నగరంలోని అన్ని కొరియర్ సంస్థలకు ప్రతి పార్సిల్‌ను తప్పనిసరిగా స్కాన్ చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అనుమానాస్పద పార్సిళ్లు వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.గురువారం మీడియాతో మాట్లా డుతూ.. అధికారులు, గుడిమల్కపూర్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి నిందితుల్ని అరెస్ట్ చేశారన్నారు. గంజాయిను స్పీడ్ పోస్ట్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నారని.. జార్ఖండ్‌కు చెందిన సత్యం మిశ్రాను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇంటర్ చదివిన సత్యం మిశ్రా పెయింట్ పని చేసి మానేశాడని.. ఆ తర్వాత లారీ డ్రైవర్‌గా పనిచేశాడన్నారు. 2018లో గంజాయికి అలవాటు పడ్డ మిశ్రా.. రాహుల్ జై, సచిన్ మిశ్రా, సంతోష్‌తో సిండికేట్‌గా ఏర్పడి.. సొంత ఊరిలోనే గంజాయి పంట వేశారని తెలిపారు. ఊరిలో చాలా మందితో గంజాయి పంట పండించి కొనుగోలు చేసి కస్టమర్లకు సరఫరా చేస్తున్నారని చెప్పారు. మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నారన్నారు. స్పీడ్ పోస్ట్, కొరియర్ సేవల ద్వారా 21 రాష్ట్రాలకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్, ముంబై, చెన్నై, ఢిల్లీ, బెంగళూరు సహా పలు నగరాలకు గంజాయి సరఫరా చేస్తున్నారని సజ్జనార్ తెలిపారు.

# ఇండో పసిఫిక్‌లో శాంతి, భద్రతే ఉమ్మడి లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనల ఆధారిత ఇండో-పసిఫిక్ ప్రాంత నిర్మాణం భారత్, జపాన్ ఉమ్మడి లక్ష్యమని స్పష్టం చేశారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడతాయని ఆమె పేర్కొన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్, జపాన్ కూడా ఉన్నాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలను విశ్వసించే దేశాలుగా రెండు దేశాలు కలిసి అనేక కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాయని చెప్పారు.

ఈ కార్యక్రమాల ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, భద్రత, ఆర్థిక పురోగతి మరింత బలపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రధాని మోడీ తనను 'అందమైన చెల్లెలు'గా సంబోధించడం సంతోషంగా అనిపించిందని తకాయిచి చెప్పారు. భారత్‌తో జపాన్‌కు ఉన్న ప్రత్యేక సంబంధాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని అన్నారు. ఇటీవల తాము నవీకరించిన "ఫ్రీ అండ్ ఓపెన్ ఇండో-పసిఫిక్" ( ఎఫ్ ఓఐపీ) విధానానికి అనుగుణంగా భారత్‌తో వ్యూహాత్మక సహకారాన్ని మరింత విస్తరించేందుకు అంగీకరించినట్లు వెల్లడించారు.

# కళ్లముందే ప్రమాదం.. కనీసం కనిపించని విద్యుత్ అధికారులు!

**● ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్.. ప్రమాదాన్ని పట్టించుకోని విద్యుత్ శాఖ ● ప్రమాద ఘంటికలు మోగుతున్నా స్పందన శూన్యం.. అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం**

**తొలి అక్షరం/ఏన్కూర్ జులై 2:** ఏన్కూర్ మండలం కోదండ రామాపురం తండ గ్రామంలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్థంభాల చుట్టూ ముళ్లపొదలు, అడవి మొక్కలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలను తాకే స్థాయికి చేరుకోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గాలులు, వర్షాలకు చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడే అవకాశం ఉందని, దీంతో షార్ట్‌సర్క్యూట్, విద్యుత్ అంతరాయం, అగ్నిప్రమాదాలు, విద్యుత్ షాక్ వంటి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ముళ్లపొదల మధ్య చిక్కుకుపోవడంతో నిర్వహణ పనులు చేపట్టడంలోనూ ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్థంభాల పరిసరాల్లో పెరిగిన ముళ్లపొదలు, చెట్లను తొలగించి భద్రతా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాల కంటే నిర్లక్ష్యమే ముఖ్యమా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తూ, విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి ప్రమాదాన్ని నివారించాలని కోరుతున్నారు




## చేనేత సహకార సంఘం ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్ నామినేషన్ దాఖలు





**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 2:** చేనేత సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్ సభ్యులు ఘనంగా నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ప్యానెల్‌కు పలువురు ప్రజాప్రతినిధులు, చేనేత నాయకులు తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో చేనేత సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జి శ్రీ కందగట్ల బిక్షపతి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీ బడుగుల లక్ష్మయ్య, పురపాలక వైస్ చైర్మన్ శ్రీ గోశిక వినయ్ కుమార్, మాజీ అధ్యక్షులు శ్రీ గోశిక చక్రపాణి, మాజీ ఎంపీపీ శ్రీ చిక్క నరసింహ, సంఘం ఉపాధ్యక్షులు శ్రీ బడుగు అంజయ్య, శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి దేవస్థానం అధ్యక్షులు శ్రీ బడుగు జయప్రకాష్, డైరెక్టర్ శ్రీ గోశిక చంద్రకళ పాల్గొని ప్యానెల్ అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్ సభ్యులు బడుగు మోహన్ బాబు, గోశిక శ్రీకాంత్, కాటబత్తిని భీమయ్య, గోశిక నరసింహ, దోర్నాల లక్ష్మీనారాయణ, పాపని రామకృష్ణ, గోశిక లక్ష్మీపతి, బడుగు సావిత్రమ్మ, బత్తుల మానస తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, సభ్యుల ప్రయోజనాల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్‌కు చేనేత కార్మికులందరూ మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రోజుకు లక్ష రూపాయల ఖర్చు.. వెంటిలేటర్‌పై కూతురు.. కాపాడాలంటూ తండ్రి కన్నీటి ఆవేదన!

**"నా ప్రాణాలైనా తీసుకో దేవుడా.. నా బిడ్డను నాకు అప్పగించు" అంటూ నబీ రోదన**

**ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో హనుమకొండ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్న 11 ఏళ్ల అయేషా**

**ఉన్నదంతా అమ్ముకున్నా సరిపోని వైనం.. దాతల సహాయం కోసం ఎదురుచూపులు**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జూలై 2:** "రెక్కాడితే గానీ డొక్కాడని పేదవాణ్ణి అయ్యా.. రోజుకు లక్ష రూపాయలంటే నా వల్ల ఎక్కడవుతుంది? నాకున్నదంతా అమ్ముకున్నా.. నా బిడ్డ ప్రాణం మాత్రం ఇంకా వెంటిలేటర్‌పైనే కొట్టుమిట్టాడుతోంది. నా ప్రాణాలైనా తీసుకో దేవుడా.. నా కళ్లముందే నా కూతుర్ని ఇలా చూడలేకపోతున్నా.. ఎవరైనా పుణ్యాత్ములు ముందుకు వచ్చి నా బిడ్డను కాపాడండి" అంటూ ఆ తండ్రి గుండె పగిలేలా ఏడుస్తున్న తీరు ప్రతి ఒక్కరినీ కన్నీరు పెట్టిస్తోంది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం, నైనాల గ్రామానికి



చెందిన నబీ , భాసురా దంపతుల 11 ఏళ్ల కుమార్తె అయేషా ప్రస్తుతం హనుమకొండలోని ఐఆర్ఏ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో మృత్యువుతో పోరాడుతోంది. తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా మారడంతో వైద్యులు అత్యవసర విభాగంలో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. బాలిక పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు పేర్కొన్నారు. **అప్పులైనా పుట్టని స్థితిలో..** కూలీ పనులు చేసుకునే ఆ కుటుంబానికి రోజుకు సుమారు 1,00,000 వరకు అవుతున్న ఆసుపత్రి ఖర్చులు భరించడం అసాధ్యంగా మారింది. కూతురి ప్రాణం కోసం ఇల్లు, ఒంటిపై ఉన్న కాస్త బంగారం.. ఇలా ఉన్నదంతా అమ్ముకున్నారు. రోజురోజుకూ కొండలా పెరుగుతున్న హాస్పిటల్ బిల్లులు కట్టలేక, అటు అప్పులు కూడా పుట్టక ఆ తండ్రి దిక్కుతోచని స్థితిలో ఆసుపత్రి కారిడార్లలో తల బాదుకుంటూ విలపిస్తున్నాడు. **మానవత్వం చాటుకుందాం..** ఏ పాపం తెలియని ఆ 11 ఏళ్ల పసిప్రాణం నిలవాలంటే ఇప్పుడు కేవలం సమాజంలోని దాతల ఉదారత, మానవత్వమే దిక్కు. మనం అందించే చిన్న సహాయం.. ఆ తండ్రి కన్నీటిని తుడిచి, ఒక పసిపాపకు పునర్జన్మను ఇవ్వగలదు. ఉదారహృదయులైన దాతలు క్రింది నెంబర్‌కు తమకు తోచిన ఆర్థిక సహాయాన్ని అందించి ఆపన్నహస్తం అందించాల్సిందిగా ప్రార్థన. ఆర్థిక సహాయం పంపవలసిన ( ఫోన్ పే / గూగుల్ పే ) నెంబర్:9949907508

# ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీసీ బంద్ విజయవంతం




**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 2:** రాష్ట్రవ్యాప్తంగా బీసీ జేఏసీ పిలుపు మేరకు నిర్వహించిన బీసీ బంద్‌లో భాగంగా చౌటుప్పల్‌లో జూనియర్, డిగ్రీ కళాశాలలు విజయవంతంగా బంద్ అయ్యాయి. బీసీ విద్యార్థుల డిమాండ్లకు మద్దతుగా కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, యువజన సంఘాలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరమళ్ళ కార్తీక్ గౌడ్ మాట్లాడుతూ, ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి, పాత పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త నిబంధనలతో పేద, మధ్యతరగతి విద్యార్థులపై అదనపు భారం పడుతోందని, విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదన్నారు. విద్య హక్కును పరిరక్షిస్తూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం మునుగోడు నియోజకవర్గ అధ్యక్షులు బండి గారి శ్రీధర్, కొప్పు రామకృష్ణ, నవీన్, భరత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్

**విద్యాశాఖ డైరెక్టరేట్ ముట్టడిలో ఉద్రిక్తత.. లాఠీచార్జీ, అరెస్టులను ఖండించిన ఎస్ఎఫ్ఐ**

**ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయం ఉపసంహరించుకోవాలని హెచ్చరిక**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02:** తెలంగాణలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించేందుకు ప్రత్యేక ఫీజు నియంత్రణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) డిమాండ్ చేసింది. ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను ఉపసంహరించుకోవాలని కోరుతూ గురువారం ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్‌ను ముట్టడించింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సమయంలో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేస్తామని ప్రకటించడం దురదృష్టకరమని విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో




విఫలమైందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో రెండు జతల యూనిఫాంలు, అల్పాహార పథకం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి హామీలు ఇప్పటికీ అమలు కాలేదని తెలిపారు. వేలాది ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, కంప్యూటర్ ల్యాబ్‌లు వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా అనేక పాఠశాలల్లో లేవని పేర్కొన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ విక్రయ కేంద్రాలుగా మారి తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నాయని విమర్శించారు. తమిళనాడు



తరహాలో తెలంగాణలో కూడా ఫీజు నియంత్రణ వ్యవస్థను అమలు చేసి తల్లిదండ్రులకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా నిరసన చేపట్టిన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జీ చేసి అక్రమంగా అరెస్టులు చేయడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండించింది. హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె. అశోక్ రెడ్డిపై లాఠీచార్జీ చేసి గాయపరిచారని ఆరోపించింది. ప్రభుత్వం వెంటనే విద్యా సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని విరమించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ హెచ్చరించింది.


# వీబీజీఆర్‌జీ బిల్లును రద్దు చేసి ఉపాధి హామీ చట్టాన్ని యథాతథంగా కొనసాగించాలి




**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 2:** చౌటుప్పల్: గ్రామీణ పేదల జీవనోపాధికి ప్రధాన ఆధారంగా ఉన్న జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టం2005ను బలహీనపరిచే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, ప్రతిపాదిత వీబీజీఆర్‌జీ బిల్లును తక్షణమే రద్దు చేసి ప్రస్తుత ఉపాధి హామీ చట్టాన్నే కొనసాగించాలని వ్యవసాయ కార్మిక సంఘం చౌటుప్పల్ మండల కార్యదర్శి చింతల సుదర్శన్, సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శివర్గ సభ్యులు చెరుకు రమేష్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రజల సంక్షేమానికి విరుద్ధంగా ఉన్న వీబీజీఆర్‌జీ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. ఉపాధి హామీ చట్టం ద్వారా కోట్లాది గ్రామీణ పేదలకు ఉపాధి, జీవన భద్రత లభిస్తోందని, ఆ చట్టాన్ని బలహీనపరిచే ఎలాంటి నిర్ణయాలనైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చింతల మధుసూదన్, గర్శ లింగస్వామి, ప్రసాదం కృష్ణ, ఎం.డి. మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 2:** కేతపల్లి మండలం కొర్లపాడు గ్రామానికి చెందిన మోదుగు కృపాకర్ రెడ్డి స్వాతి కుమారుడి పట్టు వస్త్రరకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి మోదుగు సీతారాం రెడ్డి సీనియర్ కాంగ్రెస్ నాయకులుబీరోలుశేఖర్ రెడ్డిమాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మీ రెడ్డి ప్రవీణ్ రెడ్డి కొర్లపాడు మాజీ సర్పంచ్ కుమ్మరి నాగయ్య గ్రామ శాఖ అధ్యక్షుడు భయ్యా అంజయ్య రెడ్డి బీరువాలో ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# రవీంద్రభారతి వేదికపై గాన మాధుర్యంతో మెప్పించిన ఇనుగుర్తి మురళి

**తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ నిర్వహించిన 99 రోజుల సాంస్కృతిక ఉత్సవంలో విశేష ప్రతిభ**

**పాల్కురికి సోమన మూల రవీంద్రభారతి వేదికపై గీతాలాపనతో ప్రేక్షకుల ప్రశంసలు**

**ఉత్తమ గాయకుడిగా ప్రశంసాపత్రం అందుకున్న ఇనుగుర్తి మండల గాయకుడు**

**తొలి అక్షరం/ఇనుగుర్తి జూలై 2:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలో భాగంగా, ఇనుగుర్తి మండలానికి చెందిన ప్రముఖ గాయకుడు ఇనుగుర్తి మురళి పాల్కురికి సోమన మూల రవీంద్రభారతి కళావేదికపై తన గాన ప్రతిభతో ప్రేక్షకులను విశేషంగా అలరించారు. ఆయన ఆలపించిన గీతాలు సభికులను ఆకట్టుకోగా, కార్యక్ర మం అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా ఉత్తమ గాయకుడిగా ప్రశంసాపత్రం అందు కోవడం విశేషం. ఈ సాంస్కృతిక వేడుకలో పలువురు కవులు, కళాకారులు, గాయకులు పాల్గొని కార్యక్రమా నికి మరింత శోభను చేకూర్చారు. ఇనుగుర్తి మండలా నికి చెందిన కళాకారుడు రాష్ట్రస్థాయి వేదికపై ప్రతిభ చాటు కోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




# మహాదేవాపూర్‌లో పోలీసుల కార్డన్ సర్చ్

**తొలి అక్షరం/మహాదేవాపూర్, జూలై 2:** మహదేవపూర్, జూలై 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ గ్రామంలో అక్రమ కార్యకలాపాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నివారణ లక్ష్యంగా పోలీసులు గురువారం సాయంత్రం విస్తృత స్థాయిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహదేవపూర్ సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహదేవపూర్ ఎస్‌హెచ్‌వో ఎం. సాంబమూర్తి, మహదేవపూర్ ఎస్ఐ జె. రమేష్, కాళేశ్వరం ఎస్ఐ తమాషా రెడ్డి, పాలిమెల ఎస్ఐ టి. సాయి శశాంక్‌తో పాటు పోలీసు సిబ్బంది గ్రామాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకుని ఇంటింటి తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్‌లో భాగంగా అనుమానితులు, నేరచరిత్ర కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, మొత్తం 40 వాహనాలను పరిశీలించారు. నంబర్ ప్లేట్లు లేని ఐదు వాహనాలను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.






వాహనాల రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు, ఇతర రికార్డులను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు గుడుంబా తయారీ, విక్రయం, వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై పోలీసులు అవగాహన కల్పించారు. గుడుంబా సేవించడం వల్ల ఆరోగ్య సమస్యలు, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాల పెరుగుదలతో పాటు సామాజిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా అనుమానాస్పద ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేయడంతో పాటు, ఇటువంటి ప్రత్యేక కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# బుర్ఖా... ఒక వస్త్రం కాదు, ఒక విశ్వాసం

"ముస్లిం" అంటే...
ప్రేమను పంచే మనసు,
శాంతిని కోరే జీవితం,
దేవుని చిత్తానికి లోబడే విశ్వాసం.
అయితే...
బుర్ఖా ఎందుకు ధరిస్తారు?
అందాన్ని దాచడానికి కాదు...
ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి.
ప్రపంచానికి భయపడి కాదు...
భగవంతుని ఆజ్ఞను గౌరవిస్తూ.
ఇది బలహీనతకు గుర్తు కాదు...
విశ్వాసంతో నడిచే స్త్రీ ధైర్యానికి చిహ్నం.
బుర్ఖా ఒక నల్లని వస్త్రం కాదు...
మర్యాదను కప్పుకున్న తెల్లని మనసు.
దాన్ని చూసి ఎవరినీ చిన్నచూపు చూడొద్దు...
ఎందుకంటే ప్రతి మతానికీ
తనదైన ఆచారం, తనదైన గౌరవం ఉంటుంది.
బుర్ఖా ధరించిన ప్రతి మహిళ చెప్పే మౌన సందేశం ఒక్కటే...
"నా విలువ నా రూపంలో కాదు...
నా వ్యక్తిత్వంలో ఉంది.
నా అందం నా దుస్తుల్లో కాదు...
నా నడవడికలో ఉంది.
నా గర్వం నా అలంకారంలో కాదు...
నా విశ్వాసంలో ఉంది."
మతం ఏదైనా కావచ్చు...
మనిషి గొప్పతనం అతని హృదయంలో ఉంటుంది.
గౌరవం ఇవ్వడం నేర్చుకుందాం...
ఆచారాలను అర్థం చేసుకుందాం...
భిన్నత్వాన్ని ప్రేమిద్దాం...
అప్పుడే సమాజం నిజమైన సోదరభావంతో నిలుస్తుంది.

– రచన: షకీరా జాను



# కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లు.. ఇష్టారాజ్యంగా సైరన్లు

**- ఉల్లంఘనుల గుండెల్లో గుబులు**

**- మల్కాజ్‌గిరిలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ ఆపరేషన్**

**- ఒక్కరోజే రూ.7.10 లక్షల జరిమానా వసూలు**

**తొలి అక్షరం/ రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),జూలై2:** కార్ల అద్దాలకు నల్లటి రంగులు పూసుకుని రోడ్లపై రారాజుల లా తిరుగుతున్నారా? ప్రైవేట్ వాహనాలకు అనధికారికంగా సైరన్లు, కర్ణకఠోరమైన మల్టీ-టోన్డ్ హారన్లు తగిలించి రోడ్డుపై వెళ్లే మిగతా వాహనదారులను బెంబేలెత్తిస్తున్నారా? అయితే మీలాంటి వారి కోసమే మల్కాజ్‌గిరి ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగారు. నిబంధనలు తుంగలో తొక్కి రోడ్లపై హల్చల్ చేస్తున్న ఉల్లంఘనులపై ఒక్కరోజే ఉక్కుపాదం మోపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన భారీ 'స్పెషల్ డ్రైవ్' వాహనదారుల్లో గుబులు రేపింది. మల్కాజ్‌గిరి సీపీ బి.సుమతి ఐపీఎస్ జారీ చేసిన కఠిన ఆదేశాలతో..ట్రాఫిక్ డీసీపీ-1 కె.రాహుల్ రెడ్డి ఐపీఎస్,డీసీపీ-11 వి. శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో ఉండి ఈ ఆపరేషన్‌ను నడిపించారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, బిజీ రోడ్లలో ఏసీపీలు,ఇన్‌స్పెక్టర్లు తిష్ట వేసి అడ్డంగా బుక్కైన వాహనాలకు చలాన్లు వేశారు. బ్లాక్ ఫిల్మ్‌లు తీసేశారు...సైరన్లు ఊడబీకారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో పోలీసులు ప్రదర్శించిన జోరుకు గణాంకాలే నిదర్శనం:

Malkajgiri Commissionerate Special Drive Cases on Tinted glass/Black film ,Multi Toned / Air Horn & Siren Dt: 02.07.2026

| S.No | Police station | Tinted glass/ Black film | | Multi Toned / Air Horn | | Siren | | Grand total | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | Cases | Amount | Cases | Amount | Cases | Amount | Cases | Amount |
| 1 | Malkajgiri Tr PS | 51 | 35700 | 16 | 16000 | | | 67 | 51700 |
| 2 | Gopalpuram Tr PS | 75 | 52500 | 15 | 15000 | 3 | 4000 | 93 | 71500 |
| 3 | Jawaharnagar Tr PS | 4 | 2800 | 58 | 58000 | | | 62 | 60800 |
| 4 | Trimulgherry Tr PS | 88 | 61600 | 18 | 18000 | 3 | 4000 | 109 | 83600 |
| 5 | Alwal Tr PS | 51 | 35700 | 69 | 69000 | 5 | 7000 | 125 | 111700 |
| 6 | Begumpet Tr PS | 38 | 26600 | 43 | 43000 | 6 | 6000 | 87 | 75600 |
| Zone- I | | 307 | 214900 | 219 | 219000 | 17 | 21000 | 543 | 454900 |
| 1 | LB Nagar Tr PS | 42 | 29400 | 42 | 42000 | | | 84 | 71400 |
| 2 | Vanasthalipuram Tr PS | 76 | 53200 | 0 | 0 | | | 76 | 53200 |
| 3 | Uppal Tr PS | 46 | 32200 | 37 | 37000 | | | 83 | 69200 |
| 4 | Kushaiguda Tr PS | 41 | 28700 | 2 | 2000 | 1 | 1000 | 44 | 31700 |
| 5 | Ghatkesar Tr PS | 40 | 28000 | 2 | 2000 | | | 42 | 30000 |
| Zone- II | | 245 | 171500 | 83 | 83000 | 1 | 1000 | 329 | 255500 |
| Total | | 552 | 386400 | 302 | 302000 | 18 | 22000 | 872 | 710400 |

Section:
Tinted glass/Black Film (MV Rule 100, S 177/179(1) MV Act
Multi Toned Horn / Air Horn (119(2)CMVR/177 MVA)
Siren (119(2)CMVR/190(2)MVA)

**కార్ల నల్ల అద్దాలపై వేటు:**

రూల్స్ బ్రేక్ చేసి అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ అంటించుకున్న 552 వాహనాలపై కేసులు నమోదు చేశారు. వీరికి ఏకంగా రూ.3,86,400 జరిమానా వడ్డించారు. అంతేకాకుండా స్పాట్‌లోనే ఆ బ్లాక్ ఫిల్మ్‌లను ఊడబీకించారు.

**సైరన్లు, ప్రెజర్ హారన్ల మోత బంద్:**

తామేదో వివిఐపిలమంటూ ప్రైవేట్ కార్లకు సైరన్లు,కర్ణకఠోరమైన హారన్లు అమర్చిన 320 మందిపై కేసులు నమోదు చేసి, రూ.3,24,000 ఫైన్ వేశారు. ఆ అనధికారిక సౌండ్ సిస్టమ్స్‌ను జప్తు చేశారు. బ్లాక్ ఫిల్మ్ వెనుక ఎవరున్నారో తెలియకుండా నేరాలకు పాల్పడే అవకాశం ఉంది. అలాగే ప్రైవేట్ వాహనాలకు సైరన్లు పెట్టి రోడ్లపై ఇతరులను భయపెడితే ఊరుకునేది లేదు. ఈ తనిఖీలు ఇక్కడితో ఆగవు, ఇకపై రోజూ ఇలాంటి వేట కొనసాగుతుంది అని ట్రాఫిక్ డీసీపీ లు హెచ్చరించారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రనాయక్

**● నర్సింహులపేటలో ఘనంగా వంశీ - వర్షశ్రీల వివాహం..**



**తొలిఅక్షరం/నర్సింహులపేట జూలై 02:** చిన్నగూడూరు మండలంలోని గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన గునిగంటి మోహన్‌నిర్మల దంపతుల కుమారుడు వంశీ మరియు వర్షశ్రీల వివాహ వేడుక నర్సింహులపేటలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో నిండి ఉండాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కురవి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వీరభద్రం గౌడ్, ఉమ్మడిజిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు గునిగంటి కమలాకర్, తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ బట్టు నాయక్, ఎల్లంపేట గ్రామానికి చెందిన గండి వీరభద్రం, జిల్లా యూత్ నాయకులు కుడితి నరసింహారెడ్డితో సర్పంచ్ పెద్దమాముల యాకయ్య, ఉప సర్పంచ్ కాస యాకయ్య, డెనికెని ఉపేందర్ పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమకారుల ముందస్తు అరెస్ట్




**తొలి అక్షరం/రామన్నపేట జూలై 2:** రామన్నపేట మండలంలో తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. తెలంగాణ ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం ఇవ్వాలని చలో భూదాన్ కార్యక్రమానికిటిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత ఇచ్చిన పిలుపుమేరకురామన్నపేట తెలంగాణ ఉద్యమకారులను ముందస్తుగా అరెస్టు చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్కే చాంద్ మండల అధ్యక్షులు నోముల శంకర్ మండల ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఇమామ్ తదితరులు అరెస్టు చేయడం జరిగినది.

# బందెల లింగస్వామి మృతదేవానికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**తొలి అక్షరం/రామన్నపేట జూలై 2:** రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన బందెల లింగస్వామి అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఉత్తటూరు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం మాజీ సర్పంచ్ కోళ్ల స్వామి నాయకులు కోళ్ల కిషన్ జెట్టి సైదులు పోతుల స్వామి మేడి రాజు జంగిలి శీను బందెల నరసింహ జంగిలి స్వామి యాదయ్య రాజు వెంకన్న మల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగింది



## శ్రవణ్ కుటుంబానికి పలువురి ఆర్థిక సాయం

**● భార్య అనిత, పిల్లల పేరిట రూ.లక్ష ఫిక్స్ డిపాజిట్**

**తొలి అక్షరం/రామన్నపేట జులై 2:** రామన్నపేట మండలం వెల్లంకిలో కొన్ని రోజుల క్రితం రవ్వ శ్రవణ్ అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తూ పలువురు ఆర్థిక సాయం చేశారు. అందులో భాగంగా శ్రవణ్ ఫ్రెండ్స్ SSC 2007-08 బ్యాచ్ రూ.44,900, భార్య అనిత వాజ 2012-13 బ్యాచ్ ₹26,000, జనసేన పార్టీ 11,800, గ్రామానికి చెందిన తూడి మురళీ 10,000, మార్కండేయ కాలనీ వారు ₹10,000 అందజేశారు. అంతా కలిపి రూ.లక్షను అనిత, పిల్లల పేరు మీద బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేశారు.

## బిజెపి పార్టీ ఆధ్వర్యంలో మొగులయ్యకు ఘనంగా సన్మాన కార్యక్రమం





**తొలి అక్షరం/రామన్నపేట జూలై 2:** రామన్నపేట సుభాష్ సెంటర్ లో బిజెపి మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో నకిరేకల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి నకిరేకంటి మొగులయ్య ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించిన సందర్భంగా రామన్నపేట మండల కేంద్రంలో ఘనంగా సన్మానించడం జరిగింది. పార్టీ అడుగుజాడల్లో నడుస్తూ నిబద్ధత కలిగిన బిజెపి కార్యకర్తలకు ఎల్లప్పుడూ బిజెపి పార్టీ అవకాశాలు కల్పిస్తుంది అని ఒక సామాన్య కార్యకర్త కూడా బిజెపి పార్టీలో రాష్ట్ర అధ్యక్షుడు జాతియ అధ్యక్షులు ప్రధానమంత్రి స్థాయికి కూడా ఎదగవచ్చు అని అది ఒక బిజెపి పార్టీలోనే సాధ్యపడుతుంది అని తెలిపినారు. ఈ కార్యక్రమనికి హాజరైన రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు మండల నాయకులు ప్రతి ఒక్కరు హర్షం వ్యక్తం చేయడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య జిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ గౌడ్ మండల ఇన్చార్జి కొరివి శంకర్ మండల ప్రధాన కార్యదర్శిలు జంగిలి సత్యనారాయణ బెజ్జంకి శివకుమార్ ఉపాధ్యక్షుడు బట్టే రమేష్ కార్యదర్శి బాత్క నరేష్ సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనారాయణ రాజు గజం సత్యం గోపగోని ధర్మరాజు ఆకిటి యాదయ్య రాపోలు విశ్వనాథం యాదయ్య వెంకట్ వీరమల్ల సత్యనారాయణ గండికోట శీను తదితరులు పాల్గొన్నారు

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లపై దొంగల కన్ను..

**● నర్సింహులపేటలో కాపర్ వైర్ చోరీ!**

**● అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్న ఎస్సై బానోత్ వెంకన్న**



**తొలిఅక్షరం/నర్సింహులపేట, జూలై 02 :** నర్సింహులపేట స్టేజీ సమీపంలోని ఖమ్మంవరంగల్ ప్రధాన రహదారి పక్కన భారీ చోరీ వెలుగుచూసింది. అక్కడ ఉన్న బీఆర్‌కే బ్రిక్స్ ఫ్యాక్టరీ ప్రాంగణంలోని 25 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన విలువైన కాపర్ వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం.. బుధవారం రాత్రి వేళల్లో ఈ దొంగతనం జరిగినట్లు భావిస్తున్నారు. ఈ ఘటనపై విద్యుత్ శాఖ లైన్‌మెన్ చెల్లమయ్య స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు నర్సింహులపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ.. అర్ధరాత్రి వేళల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. అలాంటి వ్యక్తుల గురించి ఏదైనా సమాచారం తెలిస్తే తక్షణమే పోలీసులకు లేదా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి సహకరించాలని ఎస్సై వెంకన్న తెలిపారు.

## ఓటరు జాబితా సవరణపై ప్రజలకు అవగాహనా



**తొలి అక్షరం/మహాదేవాపూర్, జూలై 2:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామంలో గురువారం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, బూత్ సూపర్వైజర్ మెంగని అశోక్ పాల్గొని ప్రజలకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి భారత పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అత్యంత విలువైన హక్కు అని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, అవసరమైన మార్పులు, చేర్పులు, సవరణలు సకాలంలో చేయించుకోవాలని సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే బూత్ స్థాయి ఏజెంట్లు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సవరణ ప్రక్రియ విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ లచ్చిరెడ్డి, మహేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు

**విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించాలి**

**పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలి... జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 2:** విధుల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదు జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ హెచ్చరించారు. గురువారం జిల్లాలోని గార్ల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి వసతులు, బోధన, విద్యార్థినుల సంక్షేమంపై సమీక్షించారు. కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి వారి చదువు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, భోజనశాల, వసతి గృహాలు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాన్ని స్వయంగా పరిశీలించారు. గార్ల మండల కె.జి.బి.వి ప్రత్యేక అధికారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విధులలో నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదనపు తరగతి వసతుల కోసం నిర్మాణాన్ని పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులతో పనులు వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, నాణ్యతలో రాజీ పడవద్దని తెలిపారు. హాస్టల్, టాయిలెట్స్, కిచెన్ పరిసరాలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థుల డార్మిటరీ లను పరిశీలించి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి నెల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రికార్డులు మెయింటైన్ చేయాలని అన్నారు. ఉపాధ్యాయులు సిలబస్‌ను సమయానికి పూర్తి చేసి, వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. సరైన టీచింగ్ ప్లాన్ తో విద్యార్థులకు ఉత్తమ భోధన అందించాలని అన్నారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యశీశాలను వివరంగా అర్ధమయ్యే పద్దతిలో పాఠాలు భోదించాలని, ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించే విధంగా ప్రతి అంశాన్ని వివరంగా వివరించాలన్నారు. నిర్లక్ష్యంగా బోధించే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయుల బోధనా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ పాఠాలు చదివి వినపించమన్నారు. వాటి యొక్క అర్థాలను తెలుయకపోతే అట్టి అంశాలపై కలెక్టర్ స్వయంగా వివరించారు. విద్యార్థుల ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పరిశీలించారు. "బాలికల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకూడదు. వారికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం మన బాధ్యత" అని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. వారి ఉన్నత చదువుల లక్ష్యాల గురించి అడిగి తెలుసుకుని ప్రోత్సహించారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఇన్ పేషంట్, ఔట్ పేషంట్ వివరాలను, పనిచేస్తున్న సిబ్బంది వివరాలు, హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో స్పెషలిస్ట్ వైద్యుల వివరాలు తెలుసుకున్నారు. పేషంట్ లకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి పరిశుభ్రమమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఆసుపత్రి వార్డులను పరిశీలించి పేషెంట్ లకు అందుతున్న వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. పేషెంట్ ల తొ మాట్లాడి వారి వివరాలను, వారికి ఆసుపత్రిలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ లతో మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వైద్య సదుపాయాలు అందించాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజాలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి సిబ్బంది విధుల నిర్వహణ పై, పెండింగ్ ఫైళ్ల వివరాల నివేదికలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది వారు కేటాయించిన విధులను సక్రమంగా, పూర్తి పారదర్శకంగా, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అన్నారు. ఫారాల పంపిణీ ప్రక్రియ ఎంతవరకు కొనసాగుతుందని అందుకు సంబంధించిన నివేదికలను అడిగారు. కంప్యూటర్ లో ఆన్ లైన్, ఆఫ్ లైన్ వివరాల నమోదును అడిగి తెలుసుకున్నారు. సాదాబైనామా, భూ భారతి పెండింగ్ ఫైళ్ల వివరాలను తెలుసుకున్నారు. ఈ తనిఖీలో డి.ఈ.ఓ సత్యనారాయణ, వీరభద్రరావు, స్పెషల్ ఆఫీసర్ గాయత్రి, వార్డెన్, ఎం.ఆర్.ఓ శారద, ఎం.పి డి.ఓ, ఆసుపత్రి వైద్యులు డాక్టర్ బాలు నాయక్ డాక్టర్ సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సేవలు వెలకట్టలేనివి





**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 2:** వైద్య సేవలు వెలకట్టలేని వని లైన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొండపల్లి కర్ణాకర్ రెడ్డి కొనియాడారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లయన్స్ క్లబ్ అద్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి అద్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బి. రూప్ లాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మానుకోటకు చెందిన ప్రముఖ పిల్లల సీనియర్ వైద్యులు డాక్టర్ బి.జగదీష్, మధులత దంపతులకు ఘనంగా సత్కారం చేసి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి క్లబ్ అద్యక్షులు కొండపల్లి కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న అనేక మందికి ప్రాణాలు నిలుపుతున్న వైద్యుల సేవలను గుర్తించాలన్నారు. రేయింబవళ్ళ వారు అందించే వైద్య సేవలను కీర్తించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ ఆల్టెక్ రమేశ్, ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ సందీప్, కోశాధికారి డాక్టర్ అర్జున్ , సీనియర్ వైద్యులు, ఐఎంఏ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ బాధ్యులు డాక్టర్ వెనిగళ్ల జగన్మోహన్ రావు,డాక్టర్ రూప్ లాల్, డాక్టర్ అర్జున్ రెడ్డి, డాక్టర్ దేవిరెడ్డి, డాక్టర్ ప్రమోద్ రెడ్డి, డాక్టర్ ఇంద్ర సేనారెడ్డి, డాక్టర్ భీమ్ సాగర్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బి. నెహ్రూ రాథోడ్, డాక్టర్ చాపల రంజిత్ రెడ్డి, డాక్టర్ భోనగిరి అనిల్ గుప్తా, డాక్టర్ బి. వీరన్న, డాక్టర్ బి. వెంకట్రాములు, లయన్స్ క్లబ్ సెక్రటరీ ఆల్టెక్ రమేష్, కె. సందీప్, డాక్టర్ అర్జున్, బవిరిశెట్టి నాగేశ్వరరావు, అనుమాల వెంకటేశ్వర్లు, పీ.వీ.ప్రసాద్, పర్వాల రవీందర్ రెడ్డి, డాక్టర్ సూర్య కుమారి, డాక్టర్ సౌజన్య పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌లో దొరలు కాదు.. దొంగలే" ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తీవ్ర విమర్శలు

**● "కేసీఆర్ కుంభకర్ణుడు.. కేటీఆర్, హరీష్ బకాసురులు" బీఆర్ఎస్‌పై శంకర్ ఘాటు వ్యాఖ్యలు ● అవినీతి, అప్పులతో తెలంగాణను ముంచింది బీఆర్ఎస్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02:** బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల పాలనలో తెలంగాణను అప్పులు, అవినీతి, అసంపూర్తి హామీలతో నిండిన రాష్ట్రంగా మార్చిందని షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. గురువారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలన్నీ కలిపి చేసిన అప్పుల కంటే బీఆర్ఎస్ పాలనలోనే లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని ఆరోపించారు. ప్రతి శాఖలో బకాయిలు పేరుకుపోయేలా చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, డిస్కంలు, గ్రామపంచాయతీలు, ఆర్టీసీ, మధ్యాహ్న భోజన పథకం, కాంట్రాక్టర్ల బిల్లులు సహా అనేక రంగాల్లో భారీ బకాయిలు వదిలి వెళ్లారని పేర్కొన్నారు. రైతులకు లక్ష ఎకరాలకు సాగునీరు, దళితుడే ముఖ్యమంత్రి, దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ విద్య వంటి హామీలను బీఆర్ఎస్ అమలు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విద్య, సంక్షేమం, అభివృద్ధి రంగాల్లో మార్పులు తీసుకొస్తుంటే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం, ఢిల్లీ లిక్కర్ కేసు, ఫార్ములా ఈ-కార్ రేస్, ధరణి, రైతుబంధు, దళిత బంధు, గొర్రెల పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఓఆర్ఆర్ టెండర్లు, బతుకమ్మ చీరలు, హరితహారం, మిషన్ కాకతీయ, విద్యుత్ కొనుగోళ్లు, రేషన్ బియ్యం, ఇసుక రవాణా తదితర అంశాల్లో బీఆర్ఎస్ పాలనలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. షాద్ నగర్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లను ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10 కోట్లతో వాటిని పూర్తి చేస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు చేసిన అవినీతిపై తమ వద్ద ఆధారాలు ఉన్నాయని, అవసరమైతే ఒక్కోటి ప్రజల ముందుకు తీసుకొస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, రఘు, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, నలమోని శ్రీధర్, కృష్ణ, రమేష్, జంగారి రవి, బాబు నాయక్, జంగయ్య తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా స్ఫూర్తికి కొత్త దిశ.. ట్రాన్స్‌కో వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శిగా పుల్యాల రాజిరెడ్డి

**ఉద్యోగుల్లో క్రీడా చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని నూతన ప్రధాన కార్యదర్శి పుల్యాల రాజిరెడ్డి స్పష్టం**

**ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గానికి ఉద్యోగులు, అధికారులు హర్షం అభినందనల వెల్లువ**

తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ, జూలై 2: ట్రాన్స్‌కో వరంగల్ సర్కిల్ స్పోర్ట్స్ కౌన్సిల్ నూతన కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిగా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఏడీఈ) పుల్యాల రాజిరెడ్డి ఎన్నిక కావడం పట్ల ట్రాన్స్‌కో అధికారులు, ఉద్యోగులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు. క్రీడా రంగంలో ఆయనకు ఉన్న అనుభవం, ఉద్యోగుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో చూపిన చొరవ, సేవలను గుర్తించిన కార్యవర్గం ఈ కీలక బాధ్యతలను ఆయనకు అప్పగించింది. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో సూపరింటెండెంట్ ఇంజనీర్ బి. రవీంద్ర అధ్యక్షుడిగా, డివిజనల్ ఇంజనీర్ చంద్ర ప్రకాశ్ ఉపాధ్యక్షుడిగా



ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించనున్న పుల్యాల రాజిరెడ్డి మాట్లాడుతూ, ట్రాన్స్‌కో ఉద్యోగుల్లో క్రీడా చైతన్యాన్ని మరింత పెంపొందించేందుకు, వివిధ క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతానని తెలిపారు. ప్రతి ఉద్యోగి క్రీడల్లో భాగస్వామి కావాలనే లక్ష్యంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. నూతన కార్యవర్గంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీగా శ్యాంప్రసాద్, జాయింట్ సెక్రటరీగా విజయ్, అవుట్‌డోర్ స్పోర్ట్స్ సెక్రటరీగా సుమన్, ఇండోర్ గేమ్స్ స్పోర్ట్స్ సెక్రటరీగా కందికొండ వెంకటేష్, మహిళా ప్రతినిధిగా పల్లె సృజన, కల్చరల్ సెక్రటరీగా శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దాసరి జయచందర్, బాలాజీ నాయక్, మురళి, టి.వి. రమేష్ ఎన్నికై కార్యవర్గాన్ని బలోపేతం చేశారు. ప్రధాన కార్యదర్శిగా పుల్యాల రాజిరెడ్డి ఎన్నిక కావడం పట్ల ట్రాన్స్‌కో అధికారులు, ఉద్యోగులు, సహచరులు, స్నేహితులు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆయన సమర్థ నాయకత్వంలో వరంగల్ సర్కిల్‌లో క్రీడా కార్యకలాపాలు మరింత విస్తరించి, ఉద్యోగుల్లో ఆరోగ్యకరమైన పోటీ స్ఫూర్తి, జట్టు భావన, శారీరక దృఢత్వం పెంపొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# షాద్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

**జూలై 4న స్పాట్ అడ్మిషన్లు.. పదో తరగతి ఉత్తీర్ణులకూ అవకాశం**

**పాలీసెట్ అర్హత లేకున్నా డిప్లొమా కోర్సుల్లో చేరే అవకాశం**

తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02: షాద్‌నగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా ఇంజినీరింగ్ కోర్సుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పరమేశ్వర్ తెలిపారు. కళాశాలలో కంప్యూటర్




సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ , సివిల్ ఇంజినీరింగ్ (రియల్ ఎస్టేట్ అండ్ వాల్యుయేషన్) కోర్సుల్లో అందుబాటులో ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుల స్వీకరణ జూలై 1 నుంచి జూలై 3, 2026 వరకు కొనసాగుతుందని, జూలై 4, 2026 ఉదయం 9:30 గంటలకు కళాశాలలో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తామని తెలిపారు. పాలీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులతో పాటు, పాలీసెట్‌లో అర్హత సాధించని వారు మరియు పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా స్పాట్ అడ్మిషన్‌కు అర్హులని వెల్లడించారు. అభ్యర్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, వాటి జిరాక్స్ ప్రతులు, నిర్ణీత ఫీజుతో వ్యక్తిగతంగా హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు ఆసక్తి ఉన్న డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎం. పరమేశ్వర్ కోరారు.

# ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల సాకారం..

**వాచా తాండాలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

**పేదల జీవన ప్రమాణాల మెరుగుదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం దోహదం చేస్తుందని నేతల అభిప్రాయం**

తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02: జిల్లేడు చౌదరిగూడెం మండలంలోని వాచా తాండాలో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎన్. చంద్రశేఖర్ పాల్గొని గృహప్రవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో ప్రజా ప్రభుత్వంలో పేదల సొంతింటి కల నెరవేరుతోందని అన్నారు. ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే





లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం ద్వారా పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు వారి కుటుంబాలకు భద్రమైన నివాసం అందుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాలూకా మహిళా అధ్యక్షురాలు, మాజీ ఎంపీటీసీ రజిత వెంకటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటనర్సింహారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కో-కన్వీనర్ అశోక్, కిసాన్ సర్పంచ్ రవి, ఉప సర్పంచ్ కిషన్, సెల్ వైస్ ప్రెసిడెంట్ ఎల్లేశ్వర్, సర్పంచ్ నర్సింహులు, సునీత రాములు, అరుణ యాదయ్య, సత్యం, సనా సలీం అర్షద్, మాజీ సర్పంచ్ సలీం, మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ సత్యంరెడ్డి, మాజీ ఎంపీటీసీ అమ్రమ్మ గోబ్ర నాయక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాపయ్య, శ్రీనివాస్, ఆజాం, లింగం గౌడ్, మల్లేష్, నవీన్ గౌడ్, మోహన్ తదితరులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ (ప్రత్యేక సమగ్ర లిసవరణ )సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మస్కు నర్సింహా

తొలి అక్షరం/వలిగొండ జులై 02: వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ మోటే జంగమ్మ లింగస్వామి గారి అధ్యక్షతన SIR ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగిన సమావేశం లో సర్పంచు మరియు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్కు నర్సింహా పాల్గొని మాట్లాడుతూ గ్రామం లో BLO ప్రతి ఒక్క ఓటరు కు ఎన్యూమరేషన్ ఫారం ఇస్తది కాబట్టి వివిధ దీూా లు ప్రతి ఒక్కరుకూడ ఏన్యుమరేషన్ ఫారం లో వివరాలు ఎలా రాయాలో ఓటర్లకు వివరిస్తూ ఒక్క ఓటు కూడ కోల్పోకుండా చూసుకోవాలని అదేవిదంగా BLO కు సహకరించాలని, మరియు రెండు చోట్ల ఓటు ఉన్నట్లయితే ఏదో ఒక చోట మాత్రమే ఓటు ఉండేటట్లు చూసుకోవాలని ఓటర్లకు సూచించాడు వివిధ పార్టీల నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు



మరియు ఓటర్లు కూడ తమ వివరాలతో ఈ SIR కార్యక్రమం సవ్యంగా జరిగేటట్లు విజయవంతం చేయాలనీ కోరారు పంచాయితీ కార్యదర్శి కోల మచ్చగిరి, వార్డు మెంబెర్ నారి లింగస్వామి BLO & అంగన్వాడీ కార్యకర్త పలుసం రామనర్సమ్మ ఓటర్లు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు..

# కార్యకర్తలకు అండగా ఉంటా: దైద రవీందర్



తొలి అక్షరం/రామన్నపేట జూలై 2: నకిరేకల్ మండలం నోముల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆలగడప యాదయ్య అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతదేహానికి పూలమాలలతో నివాళులర్పించి దహణసంస్కారాల నిమిత్తం 5000/ (ఐదు వేల రూపాయలు) ఆర్థిక ఒసహాయం అందించినదైద రవీందర్ – తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాస కరుణాకర్ రెడ్డి గ్రామ సర్పంచ్ పొట్టబత్తుల జయమ్మ వెంకటేశం , పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి జాన్ రెడ్డిమాజీ ఎంపీటీసీ సామ రవీందర్ రెడ్డి , సామ సత్తిరెడ్డికుంచం సోమయ్య , కందాల వెంకట్ రెడ్డి , చంద్రారెడ్డి , సంతోష్ , మాచర్ల యాదగిరి , రాములు తదితరులు పాల్గొన్నారు

# గార్లఓడ్డు గ్రామంలో ఆయిల్ ఫామ్ తోటను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**• ఆయిల్ ఫామ్ సాగుతో రైతు ఆదాయం రెట్టింపు..**

**ప్రత్యామ్నాయ పంటలపై కలెక్టర్ దృష్టి**



తొలి అక్షరం/ఏన్కూర్ జులై 2: ఏన్కూర్ మండలంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ పర్యటించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల పై మొగ్గు చూపాలని, సాగులో భాగంగా ప్రభుత్వం ఆయిల్ ఫామ్ కోసం పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ దివాకర ఐఏఎస్ తెలిపారు. గురువారం ఏన్కూరు మండలం గార్లఒడ్డు గ్రామంలోని కట్టా హరినాథ్ బాబు ఆయిల్ ఫామ్ తోటను సందర్శించి రైతు అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. ఆయిల్ ఫామ్ సాగు కోసం మొక్కలు, నిర్వహణ, అంతర పంట వేసుకోవడానికి రాయితీ నాలుగేళ్ల పాటు కల్పిస్తూ డ్రిప్ సౌకర్యం కూడా ఇవ్వడం రైతుకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న రైతు వారి అనుభవాన్ని తెలియజేస్తూ, ఎకరానికి ఖర్చులు పోను రూ. 80,000 నికర ఆదాయం వచ్చిందని, తనకున్న 10 ఎకరాల్లో 8 లక్షల ఆదాయం గడించానని, తనకు ప్రతి నెల జీతం లాగా ఆదాయం వస్తుందని తెలిపారు. ఉద్యాన అధికారి ఆకుల వేణు రైతులకు కల్పిస్తున్న రాయితీ వివరాలను అలాగే అంతర పంటగా కోకో, వక్క, కూరగాయలు ద్వారా వస్తున్న అదనపు ఆదాయం గురించి వివరించారు. రైతులకు ఆయిల్ ఫామ్ సాగు వైపు మళ్లించలని ఉద్యాన అధికారి ఆకుల వేణును కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో ఏనుకూరు తహసిల్దార్ శేషగిరిరావు, గోద్రెజ్ ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

# చైతన్య కార్యక్రమాలు ప్రజలకు మరింత ఉపయోగపడతాయి

- **కేశంపేట మండల మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి**
- **కల్వకుర్తిలో ప్రజా పాలన బస్సు యాత్ర ముగింపు**
- **కార్యక్రమంలో పాల్గొన్న తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి**



తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02:కల్వకుర్తిలో నిర్వహించిన మల్లు రవి ఆధ్వర్యంలోని "ప్రజా పాలన ప్రగతి నివేదిక జ్ఞాన చైతన్య" బస్సు యాత్ర ముగింపు కార్యక్రమంలో షాద్‌నగర్ మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా ఈ బస్సు యాత్రను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే ఈ ముగింపు సభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలను ఆహ్వానించి విజయవంతం చేసినందుకు మల్లు రవి గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవంతం కావడం ఆనందదాయకమని, ఇలాంటి చైతన్య కార్యక్రమాలు ప్రజలకు మరింత ఉపయోగపడతాయని విశాల శ్రవణ్ రెడ్డి అన్నారు

# డాక్టర్స్ డే సందర్భంగా ప్రముఖ వైద్యులకు ఘన సన్మానం

**లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో వైద్య సేవలకు గుర్తింపు**




తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ స్టార్స్ ఆధ్వర్యంలో ప్రముఖ వైద్యులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ నూతన అధ్యక్షుడు మంచిరేవుల అశోక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జోన్ చైర్మన్ ఎల్కుర్తి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహబూబ్‌నగర్ రోడ్డులోని శారద ఫెర్టిలిటీ సెంటర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా. శారద, డా. నాగవర్ధన్ రెడ్డి, డా. విజయ, డా. శ్రీనివాస్, డా. చందన, డా. కిరణ్, డా. అరుణ్, డా. కార్తీక్, డా. సాజియా తదితర వైద్యులను శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్యులు అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, సమాజ నిర్మాణంలో వారి పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. డాక్టర్స్ డే సందర్భంగా వారి సేవలను గుర్తించి సత్కరించడం గర్వకారణమని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రామచందర్, సీనియర్ లయన్స్ సభ్యులు మంచిరేవుల సాయికృష్ణ, గండు నారాయణ, మల్చలం మురళి, ఆంజనేయులు, నారియా నాయక్, సతీష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. చివరగా సభ్యులంతా "లాంగ్ లివ్ లయనిజం" నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు.

# చౌదరిగూడలో 'అమ్మ ఐ కేర్ ఆప్టికల్స్' ప్రారంభం..
# నాణ్యమైన నేత్ర సేవలు అందుబాటులోకి: కర్ణం ప్రహ్లాద్ రావు

**గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక నేత్ర వైద్య సేవలు అవసరం.. కంటి ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దని సూచన**





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02:** ప్రజలకు నాణ్యమైన నేత్ర పరీక్షలు, అత్యాధునిక కంటి అద్దాలు, మెరుగైన నేత్ర సంరక్షణ సేవలు గ్రామీణ ప్రాంతాల్లోనే అందుబాటులోకి రావడం అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్ణం ప్రహ్లాద్ రావు అన్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన'అమ్మ ఐ కేర్ ఆప్టికల్స్ ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి దుకాణాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడిన ఆయన, ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల వినియోగం పెరగడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు కంటి సమస్యలు అధికమవుతున్నాయని తెలిపారు. అందువల్ల ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా చిన్న సమస్య కనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆలస్యం చేస్తే భవిష్యత్తులో తీవ్రమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన నేత్ర సేవలు అందించే కేంద్రాలు మరింత అవసరమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ఉత్తమ సేవలు అందించాలని నిర్వాహకులకు సూచించారు. నూతనంగా ప్రారంభమైన 'అమ్మ ఐ కేర్ ఆప్టికల్స్' యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేసిన కర్ణం ప్రహ్లాద్ రావు, వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు ఎదిర రాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు కోనేరు శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు బోయ కుర్మయ్య, చౌడాపూర్ మండల అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు బంధ్యయ్య రవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, వ్యాపారవేత్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభోత్సవం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించబడగా, చౌదరిగూడ ప్రాంత ప్రజలు తమకు నాణ్యమైన నేత్ర సేవలు స్థానికంగానే అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# అమర్నాథ్ యాత్రకు బయలుదేరిన షాద్‌నగర్ హిందూ వాహిని నాయకులు

**ప్రతి పేద హిందువుకు ఉచిత అమర్నాథ్ యాత్ర కల్పించాలని తెలంగాణ ప్రభుత్వానికి హిందూ వాహిని విజ్ఞప్తి**



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 02:** హిందువుల ఆరాధ్య దైవమైన పరమశివుడు హిమాలయ పర్వతాల్లో కొలువై ఉన్న పవిత్ర క్షేత్రం శ్రీ అమర్నాథ్ యాత్రకు షాద్‌నగర్‌కు చెందిన హిందూ వాహిని నాయకులు గురువారం బయలుదేరారు. యాత్ర ప్రారంభానికి ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి ఆశీస్సులు కోరుతూ భక్తి శ్రద్ధలతో ప్రయాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని నాయకులు మాట్లాడుతూ, శ్రీ అమర్నాథ్ యాత్ర హిందువులకు అత్యంత పవిత్రమైనదే కాకుండా సాహసోపేతమైన యాత్ర అని పేర్కొన్నారు. పురాణాల ప్రకారం పరమశివుడు పార్వతీ దేవికి అమరత్వ రహస్యాన్ని హిమాలయ పర్వతాల మధ్యనున్న గుహలో బోధించినందున ఆ ప్రాంతానికి "అమర్నాథ్" అనే పేరు వచ్చిందని తెలిపారు. సముద్ర మట్టానికి సుమారు 14 వేల అడుగుల ఎత్తులో సహజసిద్ధంగా ఏర్పడే హిమలింగాన్ని దర్శించడం ప్రతి భక్తుడికి అరుదైన ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుందని అన్నారు. జీవితంలో ప్రతి హిందువు కనీసం ఒక్కసారైనా అమర్నాథ్ యాత్ర చేయాలని, ఆర్థికంగా వెనుకబడిన భక్తులకు కూడా ఈ అవకాశం కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం ఉచిత అమర్నాథ్ యాత్ర పథకాన్ని ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. స్వామివారి హిమలింగ దర్శనం చేసే భాగ్యం తమకు లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని చెప్పారు. ఈ యాత్రలో చెట్ల వెంకటేష్, ప్రవీణ్ సింగ్, అందే జంగారాజ్, శివశంకర్, సళ్ళ మహేష్, అశోక్, శ్రీను, లింగారం సాయి, పసులోటి శ్రావణ్, కుమార్, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జగన్నాథ రథయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్




**తొలి అక్షరం/కరీంనగర్ టౌన్ జూలై 02:** కరీంనగర్ నగరంలో ఈ నెల 16వ తేదీ, గురువారం నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రకు సంబంధించిన పోస్టర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ, కరీంనగర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ జగన్నాథ రథయాత్ర నగరంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంపొందించే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. జులై 16వ తేదీ మధ్యాహ్నం 1 గంటలకు మహాశక్తి టెంపుల్ వద్ద ప్రారంభమయ్యే ఈ పవిత్ర రథయాత్ర వైశ్య భవన్ వరకు ఘనంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, కీర్తనలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు పాల్గొనే ఈ రథయాత్రలో ఈ ఏడాది కూడా కరీంనగర్ నగరంలోని 66 డివిజన్ల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మేయర్ పిలుపునిచ్చారు. నగర ప్రజలందరూ సకుటుంబ సమేతంగా విచ్చేసి శ్రీ జగన్నాథ స్వామివారి రథాన్ని లాగి వారి దివ్య ఆశీర్వాదాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నరహరి ప్రభు జీ ,కో ఆప్షన్ సభ్యులు కన్న కృష్ణ,డాక్టర్ ఎల్ రాజభాస్కర్ రెడ్డి, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, తుమ్మల రమేష్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశంలు పాల్గొన్నారు

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి







**- మధ్యాహ్న భోజనంలో నాణ్యత, పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**- కొణిజెర్ల మండలం పల్లిపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**తొలి అక్షరం/ఖమ్మం , జూలై 2:** ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని, ఆరోగ్యంగా ఉంటేనే పిల్లలు చదువు మీద శ్రద్ధ చూపెడతారనీ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం వైరా నియోజకవర్గ పర్యటనలో భాగంగా కొణిజెర్ల మండలం పల్లిపాడు గ్రామం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ సందర్శించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రత, తరగతి గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి వసతి, వంటగది నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్ దివాకర టిఎస్ మధ్యాహ్న భోజనం చేశారు. పిల్లలకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా, మెనూ ప్రకారం గుడ్డు, వెజిటబుల్ బిర్యానీ, పప్పు, సాంబారు అందిస్తున్నారా, ఆహారం పరిశుభ్రంగా తయారవుతోందా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని, నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని, మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వినియోగించాలని, ప్రతి పాఠశాలలో కిచెన్ గార్డెన్‌ను ఏర్పాటు చేసి తాజా కూరగాయలను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులతో నిరంతరం సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన భోజనం, మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కొణిజెర్ల తహసీల్దార్ అరుణ, వైరా మున్సిపల్ కమీషనర్ రామచందర్ రావు, ఎంఈవో చావా శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈఎఫ్‌ల డిజిటైజేషన్ పరిశీలించిన సబ్-కలెక్టర్ అజయ్ యాదవ్



**తొలి అక్షరం/తల్లాడ, జూలై 2:** తల్లాడ మండలంలోని కుర్ణవల్లి గ్రామంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారమ్‌ల డిజిటైజేషన్ ప్రక్రియను కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ పరిధిలోని పోలింగ్ స్టేషన్లు నెం. 53, 54, 55, 56ల్లో జరుగుతున్న డిజిటైజేషన్ పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా డిజిటైజేషన్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఎన్యూమరేషన్ ఫారమ్‌లోని వివరాలను క్షుణ్ణంగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

# ధృవ్ విక్రమ్‌తో మైత్రీ మూవీస్ చిత్రం ప్రారంభం

ఇటీవల బైసన్‌తో మెప్పించిన కోలీవుడ్ స్టార్ హీరో చియాన్ విక్రమ్ కుమారుడు, యువ సంచలనం ధ్రువ్ విక్రమ్ కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఒక సరికొత్త చిత్రాన్ని ప్రకటించింది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లో నాలుగో సినిమాగా వర్కింగ్ టైటిల్స్‌తో రూపొందుతున్న ఈ భారీ చిత్రం చెన్నైలో చిత్ర యూనిట్ సభ్యులు, పలువురు సినీ ప్రముఖుల సమక్షంలో పూజా కార్యక్రమాలతో అత్యంత ఘనంగా ప్రారంభమైంది. ధ్రువ్ విక్రమ్ కెరీర్‌లోనే ఇప్పటివరకు రాని ఒక డిఫరెంట్ జోనర్‌లో, అవుట్ అండ్ అవుట్ పక్కా కమర్షియల్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని మలిచేందుకు మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు డైరెక్టర్ కరణ్ ఎ. కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, ఆయనతో పాటు రైటర్ శబీ సంయుక్తంగా ఈ చిత్రానికి స్క్రిప్ట్‌ను మరియు డైలాగ్స్‌ను అందిస్తున్నారు. కేవలం కథానాయకుడి పాత్రే కాకుండా సినిమాలో మిగిలిన పాత్రలు కూడా చాలా బలంగా ఉంటాయని, ఈ నేపథ్యంలోనే చిత్రంలో కీలక పాత్రల కోసం ప్రముఖ నటుడు పృథ్వీరాజ్ మరియు యాక్టర్ సాయి దీనలను ఎంపిక చేసినట్లు చిత్రబృందం వెల్లడించింది. విక్కీ సినిమాటోగ్రాఫర్‌గా విజువల్స్ అందిస్తుండగా, చియాన్ ఎడిటర్‌గా, జి.ఎమ్. శేఖర్ ప్రొడక్షన్ డిజైనర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇందులో




హై-వోల్టేజ్ యాక్షన్ ఎపిసోడ్స్ డిజైన్ చేయడం కోసం ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ వి.ఎమ్. మోర్‌ను రంగంలోకి దించారు. ఈ పూజా కార్యక్రమాలతోనే సినిమా రెగ్యులర్ షూటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయని, రాబోయే రోజుల్లో ఈ సినిమాకు సంబంధించిన పూర్తి తారాగణం, హీరోయిన్ మరియు టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా వెల్లడిస్తారని సమాచారం.

# దసరాకు విశ్వంభర

## సన్నాహాలు చేస్తోన్న చిత్రబృందం




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సోషియో-ఫాంటసీ అడ్వెంచర్ మూవీ 'విశ్వంభర' విడుదలపై ఎట్టకేలకు ఒక స్పష్టత వచ్చేసినట్లు తెలుస్తుంది. ఈ భారీ బ్జడెట్ విజువల్ వండర్ సినిమాను రాబోయే దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు చిత్రబృందం సన్నాహాలు చేస్తుంది. చిరంజీవి ఎపిక్ ఫాంటసీ 'విశ్వంభర' దసరా పండుగ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి వస్తోంది అంటూ పలువురు మీడియా, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌లు పెట్టడంతో దసరా రాబోతుండటం పక్కా అని తెలుస్తుంది. బ్లాక్‌బస్టర్ హిట్ 'బింబిసార' చిత్ర దర్శకుడు వశిష్ట ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యువి క్రియేషన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. గతంలోనే ఈ సినిమా షూటింగ్ పూర్తయినప్పటికీ, అత్యుత్తమ అవుట్‌పుట్ కోసం భారీ విజువల్ ఎఫెక్ట్స్ మరియు గ్రాఫిక్స్ పనులపై చిత్రయూనిట్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. 'అంజి', 'జగదేకవీరుడు అతిలోకసుందరి' చిత్రాల తర్వాత చిరంజీవి నుండి వస్తున్న పూర్తి స్థాయి సోషియో-ఫాంటసీ సినిమా కావడంతో ఈ దసరాకు బాక్సాఫీస్ వద్ద మెగాస్టార్ సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# 10న వస్తున్న లఖిల్ లెనిన్

## గ్యాప్ తరవాత విజయం కోసం ఎదురుచూపు



'లెనిన్'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు అఖిల్. మురళీకిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా జులై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాను మూడేళ్ల విరామం తీసుకోవడానికి గల కారణాన్ని అఖిల్ వివరించారు. ఏజెంట్' సినిమా విడుదలైన మూడు నెలలకు నేను ప్రమాదవశాత్తు బాత్రూంలో పడ్డాను. గాజు ముక్కలు నా చేతికి బలంగా గుచ్చుకున్నాయి. ఎడమ చేతి వేళ్లకు రెండు శస్త్రచికిత్సలు జరిగాయి. 48 కుట్లు పడ్డాయి. 8 నెలల పాటు బరువులు ఎత్తలేకపోయాను. ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి 16 నెలలు పట్టింది. మూడేళ్ల విరామం తీసుకున్నందుకు నా అభిమానులు నాపై కోపంగా ఉన్నారు. ఇలా మరోసారి జరగదని వాళ్లకు నేను హామీ ఇస్తున్నాను అని అఖిల్ చెప్పారు. లెనిన్ చిత్రం గురించి మాట్లాడుతూ.. కథ వినగానే కొత్త అనుభూతి కలిగిందన్నారు. పాత్రల్లోని విభిన్న కోణాలు ఆశ్చర్యపరిచాయని తెలిపారు. ఇలాంటి కథే కాదు.. ఈ అంశంమీద ఒక్క సినిమా కూడా రాలేదని పేర్కొన్నారు. అందుకే ఇలాంటి సినిమాతోనే కమ్‌బ్యాక్ ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు.

# జైలర్-2 షూటింగ్ పూర్తి

## ప్రత్యేక పాత్రలో హృత్రిక రోషన్

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. అగ్ర కథానాయకుడు రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కించిన ఈ చిత్రానికి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. తాజాగా 'జైలర్ 2' షూటింగ్ పూర్తయినట్లు టీమ్ తెలిపింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని వెల్లడించింది. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ ఏడాది ఏప్రిల్‌లోనే పూర్తయింది. కానీ, నెల్సన్ ఈ కథలో మరికొన్ని కొత్త సన్నివేశాలు యాడ్ చేసి 25 రోజుల పాటు మళ్లీ షూటింగ్ నిర్వహించారు. తాజాగా అవి కూడా పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ అతిథి పాత్రలో నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇటీవల ఆయన చెన్నై రావడంతో ఆ వార్తలకు మరింత బలం చేకూరింది. ఈ 25 రోజుల షెడ్యూల్‌లో ఆయనకు సంబంధించిన సన్నివేశాలనే చిత్రీకరించారని సమాచారం. ఈ ఏడాది సెప్టెంబర్‌లో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'జైలర్'లో పలు భాషలకు చెందిన అగ్రతారలు అతిథి పాత్రల్లో మెరిసిన విషయం తెలిసిందే. రెండో భాగంలోనూ ఆ సందడి కొనసాగనుంది. సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి కూడా ఇందులో కీలకపాత్రలో కనిపించనున్నారు. మొదటి భాగం ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే సీక్వెల్ ప్రారంభమవుతుందని గతంలో శివరాజ్ కుమార్ తెలిపారు.

-------




# ఫ్రాన్స్‌లో రాజమౌళికి అరుదైన గౌరవం...


## 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్'పై జక్కన్న పేరు




ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళికి అంతర్జాతీయ స్థాయిలో మరో అరుదైన గౌరవం దక్కింది. చలనచిత్ర రంగానికి పురిటిగడ్డగా భావించే ఫ్రాన్స్‌లోని లయోన్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్టిట్యూట్ లుమియర్' ఆయన్ను ఘనంగా సత్కరించింది. అక్కడి ప్రఖ్యాత 'వాల్ ఆఫ్ ఫిల్మ్‌మేకర్స్' పై రాజమౌళి పేరుతో శాశ్వత స్మారక ఫలకాన్ని ప్రతిష్టించింది. ఈ అరుదైన గౌరవం ద్వారా మార్టిన్ స్కోర్సెస్సీ, క్లింట్ ఈస్ట్‌వుడ్, క్వెంటిన్ టరంటినో, ఫ్రాన్సిస్ ఫోర్డ్ కపోలా వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ దర్శకుల సరసన రాజమౌళి నిలిచారు.

జూలై 1, 2 తేదీల్లో జరిగిన ఈ వేడుక అనంతరం రాజమౌళి తన అనుభూతులను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. "లుమియర్ మ్యూజియంను సందర్శించాను. నా సినిమాలు 'ఈగ', 'ఆర్ఆర్ఆర్' ప్రదర్శితమవుతున్న స్క్రీనింగ్ రూమ్‌కు వెళ్ళిన సమయంలో ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ థియరీ ఫ్రెమాక్స్ నన్ను అక్కడి ప్రేక్షకులకు పరిచయం చేసి, ఒక సర్ ప్రైజ్ ఉందని చెప్పారు. నన్ను సినిమా పుట్టిన వీధిలోకి తీసుకెళ్లగా, అక్కడ ప్రపంచ ప్రఖ్యాత దర్శకుల పేర్లతో కూడిన ఫలకాలు కనిపించాయి. ఎరుపు రంగు వస్త్రంతో కప్పి ఉన్న ఒక ఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. దానిపై నా పేరు చూసి ఒక్కసారిగా భావోద్వేగానికి లోనయ్యాను. ఈ అరుదైన గౌరవానికి వినమ్రంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని రాజమౌళి వివరించారు. ఇటీవలే పారిస్‌లోని 'సినీమాథెక్ ఫ్రాన్సైస్' థియేటర్‌లో రాజమౌళి పేరుతో ఒక శాశ్వత సీటును కేటాయించిన సంగతి తెలిసిందే. తాజా గౌరవంతో ఆయన అంతర్జాతీయ ఖ్యాతి మరో మెట్టు ఎక్కింది. జూన్ చివరి వారం నుంచి జూలై మధ్య వరకు ఇన్‌స్టిట్యూట్ లుమియర్ రాజమౌళి చిత్రాలైన 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' వంటి చిత్రాలతో ప్రత్యేక 'రెట్రోస్పెక్టివ్'ను నిర్వహిస్తోంది.

# ఇది కదా ఫ్యాన్స్ కోరుకునేది..!



ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పరిపాలన, రాజకీయాలతో ఎంత బిజీగా ఉన్నాడో తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో తిరుగుతూ, ఢిల్లీలో మీటింగ్స్, పార్టీ కార్యక్రమాలు, మీటింగ్‌లు, అధికారులతో పర్యవేక్షణ ఇలా చెప్పుకుంటూ పోతే ఆయన ఫుల్ బిజీగా ఉంటాడు. చేతికి గాయం అయినప్పటికీ ఆపరేషన్ వాయిదా వేసుకుని మరీ అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు. అంతగా బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ మళ్లీ కెమెరా ముందుకు వస్తాడని, ఆయన సినిమాల్లో నటిస్తాడని చాలా మంది అనుకోవడం లేదు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన నుంచి వచ్చిన సినిమాలన్నీ కూడా అంతకు ముందు కమిట్ అయిన సినిమాలే అనే విషయం తెల్సిందే. అయితే ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి బిజీగా ఉన్న క్రమంలోనూ పవన్ ఒక మూవీని కమిట్ అయ్యాడని, అది 'ఓజీ 2' అంటూ ఈ మధ్య కాలంలో తెగ ప్రచారం జరుగుతోంది. ఇటీవల దర్శకుడు సుజీత్ స్వయంగా పవన్ కళ్యాణ్ ను కలిసి ఓజీ 2 గురించి చర్చించడం జరిగింది. పవన్‌కి మాత్రమే కాకుండా ఆయన ఫ్యాన్స్‌కి ఎంతగానో నచ్చిన మూవీ ఓజీ. అందుకే ఆ సినిమాకు కొనసాగింపుగా ఫ్రాంచైజీలో మూవీ చేయాలని పవన్, సుజీత్ నిర్ణయించారు. ఆ సినిమా నిర్మాణంలో పవన్ సైతం నిర్మాణ భాగస్వామి అయ్యే అవకాశం ఉంది. ఓజీ ఫ్రాంచైజీ మూవీలో ఓజీ నిర్మాత ఉండక పోవచ్చు అనే ప్రచారం జరుగుతోంది. ఆ విషయం పక్కన పెడితే ఓజీ 2 గురించిన చర్చ జరుగుతున్న సమయంలో ఈ ఫోటో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సాధారణంగానే పవన్ కళ్యాణ్ ఫోటోలకు విపరీతమైన క్రేజ్ ఉంటుంది. ఇక మూవీ స్టిల్స్ అయితే సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో రెస్పాన్స్ ఉంటుంది. తాజాగా ఈ ఫోటో సోషల్ మీడియాలో కనిపించిన వెంటనే వైరల్ అయ్యింది. అభిమానులు, అన్ని వర్గాల వారు సోషల్ మీడియాలో పవన్ కళ్యాణ్ కు చెందిన ఈ కొత్త స్టిల్‌ను తెగ షేర్ చేశారు. నిమిషాల వ్యవదిలోనే వైరల్ అయ్యింది. ఓజీ 2 హ్యాష్ ట్యాగ్‌తో చాలా మంది ఈ ఫోటోను షేర్ చేయడంతో మళ్లీ ఓజీ సినిమా గురించిన చర్చ మొదలైంది. పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఏం కోరుకుంటారో దర్శకుడు సుజీత్ అది ఇస్తాడని మరోసారి ఈ ఫోటోతో నిరూపితం అయ్యింది. చాలా సింపుల్ స్టిల్‌లో పవన్ కళ్యాణ్ చూపు తిప్పలేనంతగా ఆకట్టుకుంటున్నాడని అభిమానులు అంటున్నారు. బ్లాక్ హుడీలో గడ్డంలో పవన్ కళ్యాణ్ స్టైలిష్ అవతారంలో కనిపిస్తున్నాడని అభిమానులు కామెంట్ చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ ను ఇదే లుక్‌లో దర్శకుడు సుజీత్ ఓజీ 2 లో చూపించే అవకాశం కనిపిస్తుంది. ఇదే లుక్‌తో ఓజీ 2 వస్తే కచ్చితంగా ఫ్యాన్స్ కి మరో పెద్ద పండుగ అనడంలో ఎలాంటి సందేహం లేదు అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.